సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం । 7 । అక్టోబర్ । 2023



ఉమ్మడి జిల్లాకు ఐదు కోర్టులు

ఉమ్మడి వరంగల్ జిల్లాకు నూతనంగా ఐదు కోర్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- 8లో



ఎండు గంజాయి స్వాధీనం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో విక్రయించేందుకు తీసుకొస్తున్న ఏడు కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
$34^0/21^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు

విద్యారణ్యపురి: ఉమ్మడి జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు అపరాధ రుసుముతో ఈనెల 13 వరకు గడువు పొడిగించినట్లు హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్యా విధానంలో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులు తమ సమీపంలోని అధ్యయన కేంద్రాలైన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు. ఫీజులు మీసేవ, ఆన్‌లైన్ చెల్లించాలని, మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో చూడొచ్చని తెలిపారు.

రేపు జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు

హన్మకొండ: ఈనెల 8న జిల్లా స్థాయి సీనియర్స్ (మెన్స్ అండ్ ఉమెన్స్) బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లపెల్లి రాజు, డోలీ సాంబయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు కాజీపేటలోని సెయింట్ గాబ్రియెల్స్ స్కూల్ మైదానంలో హాజరు కావాలని సూచించారు. వెంట ఒరిజినల్ ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లా కోదాడలో జరగనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు ఇర్ఫాన్‌ను 83284 49263 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆత్మస్థైర్యం.. క్రీడలతోనే సాధ్యం




రామన్నపేట: క్రీడల ద్వారా ఉన్నత స్థాయిలో గుర్తింపు లభిస్తుందని, ఆత్మస్థైర్యాన్ని సైతం పొందొచ్చని కల్నల్ అజయ్‌నందు ఖందురీ తెలిపారు. శుక్రవారం ఎల్బీ కళాశాలలో అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపిక పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవీవీ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాక మనోహర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.గోపీ, జాయింట్ సెక్రటరీ సతీశ్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్, కిషన్, రమణ, రవి, పద్మ, సుధాకర్, సుజిత్, రాకేశ్, రాహుల్ పాల్గొన్నారు.

10న నిట్ ఆవిర్భావ దినోత్సవం

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ 65వ ఆవిర్భావ వేడుకలను ఈనెల 10న నిర్వహించనున్నట్లు నిట్ పీఆర్‌ఓ రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిర్భావ వేడుకకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ కోమల్ కపూర్ హాజరుకానున్నట్లు తెలిపారు.

అలరించిన సంతోషి ఈక్షిత భరతనాట్య అరంగేట్రం



హన్మకొండ కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి సంధ్యారాణి కుమార్తె ఆకురాతి సంతోషి ఈక్షిత భరతనాట్య అరంగేట్రం చేశారు. శుక్రవారం రాత్రి వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలోని ఎన్‌ఆర్‌ఐ ఆడిటోరియంలో ఈకార్యక్రమం ఘనంగా జరిగింది. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, కర్ణాటక సంగీత కళాకారిణి వేదాంతం దుర్గభవాని, చెన్నైకి చెందిన నృత్య దర్శకులు పార్వతిరవి ఘంటశాల ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంతోషి ఈక్షిత నాట్య ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. ఆమె తల్లిదండ్రులు సంధ్యారాణి, సురేశ్ మాట్లాడుతూ.. తమ కూతురు భరతనాట్య అరంగేట్రానికి హాజరైన నృత్యగురువులకు కృతజ్ఞతలు తెలిపారు. భారతనాట్య గురువు డాక్టర్ వసంత్ కిరణ్‌ను సత్కరించారు. హనుమకొండ శ్రీశివానంద నృత్యమాల నిర్వాహకులు, నృత్య గురువు బొంపల్లి సుధీర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన నృత్యగురువులు గీతాగణేషన్, శివచంద్ర, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పత్తివాడ నూకదుర్గారాణి, శ్రీలీలాసుఖ, వేదవ్యాస్ మహర్షి పాల్గొన్నారు.

కేటీఆర్ సుడిగాలి పర్యటన

ఉదయం నుంచి సాయంత్రం దాకా ఎనిమిది గంటలపాటు నగరంలోనే గడిపిన మంత్రి

- ట్రై సిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- పశ్చిమలో లబ్ధిదారులకు పలు సంక్షేమ పథకాల అందజేత
- నిర్ణీత సమయానికంటే గంట ఆలస్యంగా నగరానికి
- సమయం మించిపోవడంతో మరికొన్ని కార్యక్రమాలు వాయిదా
- 'కుడా', ఖిలా వరంగల్ బహిరంగ సభల్లో ప్రసంగం
- తరలివచ్చిన పార్టీ శ్రేణులు.. విజయవంతం కావడంతో ఉత్సాహం





హనుమకొండలోని 'కుడా' మైదానంలో ఏర్పాటు చేసిన సంక్షేమ సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్





బస్తీదవాఖానాను ప్రారంభిస్తున్న కేటీఆర్, భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ డీజీపీ శిఖాగోయెల్, మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి, సత్యవతి, సీపీ రంగనాథ్

సాక్షి వరంగల్/హన్మకొండ/మడికొండ/వరంగల్ క్రైం/న్యూశాయంపేట/కాజీపేట అర్బన్/ఖిలావరంగల్ : రాష్ట్ర పురపాలక, నగరాభివృద్ధి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) వరంగల్ మహానగరంలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా 8 గంటలపాటు ఆయన పర్యటన కొనసాగింది. రూ.900 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చేరుకోవాల్సి ఉండగా.. ఉదయం 10.30 గంటలకు చేరుకున్నారు. ముందుగా రూపొందించిన టూర్ షెడ్యూల్‌కు భిన్నంగా పర్యటన సాగింది. గంట ఆలస్యం కావడంతో రూట్ మార్చారు. హెలికాప్టర్ దిగిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి నేరుగా నూతనంగా నిర్మించిన రహదారులు, భవనాల శాఖ కార్యాలయం ప్రారంభించాల్సి ఉంది. కానీ.. బంధం చెరువుకు చేరుకుని మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత వరుసగా కార్యక్రమాలు ప్రారంభిస్తూ వెళ్లారు. కార్యకర్తలు, నాయకుల్లో నూతనోత్తేజం నింపేలా హనుమకొండ, వరంగల్‌లో జరిగిన సంక్షేమ బహిరంగ సభల్లో ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తూనే రాష్ట్రంలో తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశారు.

నాగన్నా.. ఏ గట్టున ఉంటావో..

హనుమకొండ సభలో ప్రసంగిస్తూనే రంగస్థలం సినిమాలోని పాటను పాడారు. 'నాగన్న ఏ గట్టున ఉంటావో తేల్చుకో నాగన్న' అంటూ పాట పాడుతూ ఓటర్లు తేల్చుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు. రైతుబంధుతో పాటు సంక్షేమ పథకాలు వివరిస్తూ.. ఈ గట్టున (బీఆర్‌ఎస్) వైపు, ఆ గట్టున అరవై ఏళ్లు పీక్కుతిన్న రాబందులు (కాంగ్రెస్), పేదలకు స్కీంలు ఇచ్చిన వినయన్న రూపంలో ఉన్న ప్రభుత్వం ఈ గట్టున ఉంటే.. ఆ గట్టున స్కాంల కాంగ్రెస్, బీజేపీలున్నాయంటూ, ఈ గట్టున నీళ్లు ఉన్నాయి. ఆ గట్టున కన్నీళ్లు ఉన్నాయి.. ఈ గట్టున సారు కారు ఉన్నది. ఆగట్టున కాంగ్రెస్, బీజేపీ బేఖారుగాళ్లు ఉన్నారంటూ తూర్పారబట్టారు.

భారీ బందోబస్తు

మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ నగరంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ముందుగానే కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని ప్రకటించిన వివిధ సంఘాల నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. ఆంక్షలు విధించడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడలేదు. కేటీఆర్ బందోబస్తులో వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌తో సహా నలుగురు డీసీపీలు, 14 మంది ఏసీపీలు, 36 మంది ఇన్‌స్పెక్టర్లు, 74 మంది ఎస్సైలు, 241 ఏఎస్సైలు, 773 మంది కానిస్టేబుళ్లు, 64 మంది మహిళా కానిస్టేబుళ్లు, సుమారు 500 మంది హోంగార్డులు, మొత్తం 1,600 మందితో భారీ బందోబస్తు నిర్వహించారు.

కేటీఆర్ వస్తే ఉత్తేజం.. ఉత్సాహం: వినయ్

మంత్రి కేటీఆర్ వస్తే ప్రజల్లో ఉత్తేజం.. ఉత్సాహం.. పట్టుదల వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం హనుమకొండ 'కుడా' మైదానంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్న బహిరంగ సభలో దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో వరంగల్ మహానగరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఉద్యమం నుంచి వరంగల్‌తో కేటీఆర్‌కు అనుబంధం ఉందన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులిచ్చి అభివృద్ధిలో పాలు పంచుకున్నారని తెలిపారు. ప్రజలు తనకు మరోసారి అండగా నిలవాలని కోరారు. ప్రజల కోసం పని చేస్తున్న తనను ఆదరించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎంపీలు పసునూరి దయాకర్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు నరేందర్, అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, మేయర్ గుండు సుధారాణి, అడిషనల్ డీజీపీ శిఖాగోయల్, సీపీ ఏవీ రంగనాథ్, రెండు జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, క్రైం డీసీపీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారితో మంత్రి కేటీఆర్ సెల్ఫీ



రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చిన్నారితో ఆసక్తిగా సెల్ఫీ దిగారు. బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ నాయకుడు కేశవరావు స్వగృహంలో మధ్యాహ్న భోజనం చేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ బోయినపల్లి రంజిత్ రావు కూతురు బ్రాహ్మణి కనిపించడంతో ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని మాట్లాడారు. తాను స్వయంగా చిన్నారితో సెల్ఫీ దిగడంతో పాటు చిన్నారిచే సెల్ఫీ తీయించుకున్నారు.











ల్యాండ్రో మార్ట్ మిషన్‌ను చీఫ్‌విప్‌తో కలిసి ప్రారంభిస్తున్న కేటీఆర్, క్వాడ్రంట్ ఐటీ సెంటర్‌ను ప్రారంభిస్తూ.. మాట్లాడుతున్న వినయ్, నిట్ జంక్షన్ వద్ద ఫౌంటేన్, కేసీఆర్ భవన్‌ను ప్రారంభిస్తున్న సారయ్య, కేటీఆర్

అభివృద్ధి కార్యక్రమాలు ఇలా..

- **ఉదయం 11 గంటలకు** బంధం చెరువుకు చేరుకుని మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం నిట్ కూడలిలో జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇక్కడి నుంచి వర్చువల్‌గా దర్గాలోని బస్తీ దవాఖానాను ప్రారంభించారు.
- **11.50 గంటల నుంచి 12.30 :** మడికొండకు చేరుకుని ఐటీ కారిడార్‌లోని క్వాడ్రంట్ ఐటీ కంపెనీని ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం కంపెనీలోని పలు విభాగాలను సందర్శించారు.
- **12.50 గంటలకు :** మడికొండ నుంచి నేరుగా హనుమకొండ బాలసముద్రంలోని కుడా మైదానానికి చేరుకున్నారు. బహిరంగ సభలో 30 నిమిషాలపాటు ప్రసంగించారు.
- **1.25 గంటలకు :** ఆర్టీసీ హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌కు చేరుకుని నూతన బస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించారు.
- **1.35 గంటలకు :** సర్క్యూట్ హౌస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన రహదారులు, భవనాల శాఖ అతిథి గృహాన్ని ప్రారంభించారు. ఇక్కడే మరో ఆరు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు పంపిణీ చేశారు.



- **2.20 :** వరంగల్ పోతననగర్‌కు చేరుకుని మోడ్రన్ ల్యాండ్రీ మార్ట్‌ను ప్రారంభించారు. తర్వాత భద్రకాళి ఆర్చి వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. అనంతరం అలంకార్ జంక్షన్ అభివృద్ధి పనులు, కాపువాడలో మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు.
- **మధ్యాహ్నం 3.15 గంటలకు :** లైంగిక దాడులకు గురైన మహిళలు, బాలికలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ఉమెన్ సేఫ్టీ విభాగం, జెమిని సంస్థ సహకారంతో వరంగల్ రంగంపేటలో నిర్మించిన భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడినుంచి బాలసముద్రానికి చేరుకున్నారు. ఏకశిలా పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన ఠానునాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.
- **మధ్యాహ్నం 3.30 గంటలకు:** హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ నాయకుడు కేశవరావు స్వగృహానికి చేరుకుని మధ్యాహ్న భోజనం చేశారు.
- **సాయంత్రం 4.15 గంటలకు:** 31వ డివిజన్ పరిధి న్యూశాయంపేట జంక్షన్‌లో రూ.6 కోట్ల నిధులతో నిర్మించిన మడివాలు మాచదేవ సాంస్కృతిక, విద్య, సాంఘిక వికాస సముదాయం కేసీఆర్ భవన్‌ను ప్రారంభించి తూర్పు నియోజకవర్గంలో ప్రవేశించారు.
- **4.51 గంటలకు:** మంత్రి కేటీఆర్ 3.30కు ఖిలావరంగల్ సభాప్రాంగణానికి రావాల్సి ఉండగా.. 4.51 గంటలకు చేరుకున్నారు.
- **5.38 గంటలకు:** ప్రసంగాన్ని ముగించుకుని మామునూరు ఎయిర్‌పోర్ట్ చేరుకున్నారు.
- **6.08 గంటలకు** హైదరాబాద్‌కు వెళ్లారు.

'తూర్పు'లో సీన్ రివర్స్

- ఇన్నాళ్లు ఎమ్మెల్యే 'నన్నపునేని'కి కార్పొరేటర్ల తలనొప్పి
- అభ్యర్థిత్వం మార్చాలని అన్నవాళ్లకే ఇప్పుడు లబ్ధిదారుల బాధ్యతలు
- మంత్రి కేటీఆర్ సభ సాక్షిగా 15,072 మందికి పట్టాలు, ప్రొసీడింగ్ కాపీలు ఇవ్వాలి
- మంత్రి కేటీఆర్ సమయభావంతో వెళ్లినా.. లబ్ధిదారులకు అందివ్వని ఎమ్మెల్యే



సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పులో పొలిటికల్ సీన్ రివర్స్ అయ్యింది. ఇన్నాళ్లు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అభ్యర్థిత్వాన్ని మార్చాలంటూ రహస్య సమావేశాలు ఏర్పాటు చేసి సంకేతాలు పంపిన కార్పొరేటర్లే ఇప్పుడు ఆయన మాట వినేలా చేసుకున్నారు. ఖిలావరంగల్ వాకింగ్ మైదానం ప్రాంగణంలో శుక్రవారం జరిగిన వరంగల్ తూర్పు నియోజకవర్గం సంక్షేమ సభలో ఒక్కరోజు 15,072 మంది లబ్ధిదారులకు పట్టాలు, పెన్షన్లు, దళితబంధు, డబుల్ బెడ్ రూమ్‌లు, మైనార్టీ బంధు, బీసీ బంధు, పంట నష్టం, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, జీఓ 58, 59 ద్వారా పట్టాలు అందిస్తున్నామని ఓ వైపు మంత్రి కేటీఆర్ సభ సాక్షిగా చెప్పారు. మంత్రి కేటీఆర్ సమయాభావం వల్ల తొందరగా వెళ్లిపోయినా.. అక్కడున్న ఎమ్మెల్యే నరేందర్ కొందరికైనా పట్టాలు, డబుల్ బెడ్ రూమ్ ప్రొసీడింగ్ కాపీలు తదితరాలు ఇస్తారని అనుకున్నారు. అయితే ఆయన ఇవ్వకుండా కార్పొరేటర్లు ఇస్తారంటూ ప్రకటించడంతో కార్పొరేటర్లు చెప్పినట్టుగా ఎమ్మెల్యే వినేలా మారారనే గుసగుసలు వినిపించాయి. కార్పొరేటర్లతో గురువారం సమావేశం ఏర్పాటు చేయకపోతే కథ మరోలా ఉండేదని, నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి బయటపడేదని, ఇది జరగకుండా ఉండేందుకు కార్పొరేటర్లు చెప్పినట్టు వినేందుకు ఎమ్మెల్యే నరేందర్ సిద్ధమయ్యారన్న ప్రచారం గులాబీ పార్టీ శ్రేణుల్లోనూ ఉంది. మొన్నటివరకు సై అంటే సై అని సవాళ్లు విసిరి, అభ్యర్థిత్వం మార్చాలని అంతర్గత సమావేశాలు ఏర్పాటు చేసి మరీ మీడియాకు లీకులిచ్చి ఇప్పుడూ అందరూ స్తబ్దుగా ఉండడంతో తెర వెనుక ఏదో జరిగిందని జనాలు కూడా చర్చించుకోవడం కనిపించింది. సభ సజావుగా సాగడంతో ఎమ్మెల్యే ఊపిరి పీల్చుకున్నారు. లబ్ధిదారుల బాధ్యతలు కార్పొరేటర్లకు అప్పగించడం ద్వారా ఏమైనా అసమ్మతి రేగితే వారినే బాధ్యుల్ని చేసే దిశగా కూడా ఇప్పటికే ముఖ్య నేతలంతా సిద్ధమైనట్లు ఆ పార్టీ వర్గాల్లో అంతర్గతంగా చర్చ సాగుతోంది. ముల్లును ముల్లుతోనే తీయాలి అన్న ఆలోచన ద్వారా కార్పొరేటర్లను కట్టడి చేయాలన్న వ్యూహమున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే కార్పొరేటర్లు కూడా ముందు జరిగే పరిణామాలను గమనించి అందుకు తగ్గట్టుగానే వారు కూడా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిసింది. అయితే 4,078 మంది వికలాంగులకు పింఛన్, 1,100 మందికి దళితబంధు, 2,200 డబుల్ బెడ్ రూమ్‌లు ప్రొసీడింగ్ కాపీలు, 930 మందికి మైనార్టీ బంధు, బీసీ బంధు, పంట నష్టం, 737 మందికి కల్యాణలక్ష్మీ, 44 మందికి షాదీ ముబారక్, 3,000 మందికి గృహలక్ష్మి, జీఓ 58, 59 కింద 3,000 మందికి పట్టాలు అందివ్వాల్సి ఉంది. ఈ లెక్కలతో ఏకంగా సభా వేదిక వద్ద 'థ్యాంక్స్ టూ సీఎం కేసీఆర్' అంటూ లబ్ధిదారుల అంకెలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వద్ద కొందరు ఫొటోలు దిగడం గమనార్హం.

అల్పాహారంతో విద్యార్థులకు మేలు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ప్రాక్టీసింగ్ పాఠశాలలో పథకం ప్రారంభం

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకంతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని, పౌష్టికాహారం అందనుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని గిరిజన సంక్షేమ శాఖ, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. తొలిరోజు విద్యార్థులకు ఇడ్లీ, పూరి, బోండా అందించారు. పలువురు విద్యార్థులకు మంత్రులు అల్పాహారం తినిపించారు. అనంతరం మంత్రి దయాకర్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించడం వల్ల హాజరు శాతం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గానికి ఒక పాఠశాలలో ప్రారంభిస్తున్నారని, దసరా సెలవుల అనంతరం అన్ని పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఈపథకాన్ని అమలు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలో 493 పాఠశాలల్లో 37 వేలకు పైగా విద్యార్థులు ఈపథకం ద్వారా లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, కలెక్టర్ సిక్తాపట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, ఆర్డీఓ శ్రీనివాస్, పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, ఆపాఠశాల హెచ్‌ఎం ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టెవాడ పాఠశాలలో..

రామన్నపేట: ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు అందించే అల్పాహార పథకాన్ని శుక్రవారం మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, కలెక్టర్ ప్రావీణ్య, తూర్పు ఎమ్మెల్యే నరేందర్ ప్రారంభించారు. వారంతా విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు. కార్యక్రమంలో డీఈఓ వాసంతి, స్థానిక కార్పొరేటర్లు ఆకుతోట తేజస్విని-శిరీష్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



పథకాన్ని ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ వినయ్, మంత్రి ఎర్రబెల్లి, కలెక్టర్ సిక్తాపట్నాయక్



పిల్లలతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న వరంగల్ కలెక్టర్, నాయకులు

ఆర్ట్స్ కాలేజీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులపై అశ్విన్ గ్యాంగ్ దాడి

ఫ్లాష్ ఫ్లాష్..

హన్మకొండ అర్బన్: హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో శనివారం జరగాల్సిన ఫ్రెషర్స్ పార్టీకి సంబంధించి శుక్రవారం అర్ధరాత్రి కళాశాల ఆడిటోరియంలో ఏర్పాట్లు చేస్తున్న విద్యార్థులపై స్థానికంగా అశ్విన్ గ్యాంగ్‌లోని కొందరు వ్యక్తులు రాళ్లు రువ్వారు. దీంతో సమీపంలో ఉన్న ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి విద్యార్థులు పెద్దఎత్తున ఆడిటోరియం వద్దకు వచ్చి దాడిచేసిన వారిని ప్రతిఘటించారు. అప్పటికే అశ్విన్ గ్యాంగ్ దాడిలో తీవ్రంగా గాయపడిన కొందరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. గొడవ ముగిసిన అనంతరం విద్యార్థులు అందరూ హాస్టల్‌కు చేరుకోగా.. అశ్విన్ గ్యాంగ్ వ్యక్తులు మరికొందరితో వచ్చి విద్యార్థులను మరోమారు చితకబాదారు. ఈ క్రమంలో నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో 108వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. వందలాది మంది విద్యార్థుల ఘర్షణతో సుబేదారి ప్రాంతం అర్ధరాత్రి రణరంగాన్ని తలపించింది. సుబేదారి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. అప్పటి వరకు పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు వారిని అదుపు చేయడానికి నానాతంటాలు పడ్డారు. ఘర్షణకు గల కారణాలు తెలియాల్సి ఉంది. హాస్టల్ విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. కాగా హాస్టల్ ఎదుట భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

క్లుప్తంగా

మృతిచెందిన యువకుడికి కానిస్టేబుల్ ఉద్యోగం


వేణు (ఫైల్)

గార్ల: రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఓ యువకుడు గురువారం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నూనావత్ వేణు కానిస్టేబుల్ రాత పరీక్ష రాశాడు. ఫలితాలు వచ్చేంత వరకు ఇంటి వద్ద ఖాళీగా ఎందుకు ఉండాలని తండ్రితో కలిసి సూర్యాపేటలో సెంట్రింగ్ కూలీ పనులకు వెళ్లాడు. 2 నెలల క్రితం పనులు ముగించుకొని తండ్రితో కలిసి బైక్‌పై వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గురువారం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో వేణు ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కుమారుడు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక అయిన విషయం తెలిసిన తల్లిదండ్రులు భద్రు, కేవూల్య కన్నీరు మున్నీరయ్యారు. ఒక్కగానొక్క కుమారుడు బతికుంటే తమను సాకేవాడని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాకు ఐదు కోర్టుల మంజూరు



వరంగల్ లీగల్ : వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నూతనంగా ఐదు కోర్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మంజూరు చేసిన 57 నూతన కోర్టుల్లో ఉమ్మడి వరంగల్‌కు రెండు అదనపు జిల్లా కోర్టులు, ఒకటి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, రెండు జూనియర్ సివిల్ జడ్జి స్థాయి కోర్టులు మంజూరయ్యాయి. నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత పెండింగ్ కేసుల పరిష్కారం, ప్రజల సౌకర్యార్థం నూతనంగా అదనపు కోర్టుల అవసరం ఏర్పడింది. అలాగే ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న ఏసీబీ కోర్టు ఎట్టకేలకు వరంగల్‌కు మంజూరైంది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ కేంద్రంలో నూతనంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వరంగల్ జిల్లాకు మూడో అదనపు జిల్లా కోర్టుగా (ఏసీబీ కోర్టు), నర్సంపేటకు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేస్తూ, ప్రస్తుతం ఉన్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు(పీడీఎం కోర్టు)గా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లాకు మూడో అదనపు జిల్లా కోర్టుగా (పోక్సో కోర్టు) మంజూరు చేశారు. హనుమకొండ జిల్లాకు రెండో సీనియర్ సివిల్ జడ్జి కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు మంజూరు చేస్తూ ప్రస్తుతం ఉన్న సీనియర్ సివిల్ జడ్జి కోర్టును మొదటి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పునర్నిర్మాణం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాదులకు వృత్తిపరంగా, న్యాయస్థానాల్లో ప్రభుత్వ నియామకాల్లో అవకాశాలు పెరిగి స్థానిక న్యాయవాదులకు అవకాశాలు లభిస్తాయి. నూతన కోర్టుల మంజూరుతో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఏసీబీ దాడుల కలకలం

- వ్యవసాయశాఖ కరీంనగర్ డిప్యూటీ డైరెక్టర్ వీరూనాయక్ ఇళ్లలో సోదాలు


రాములుతండాలోని వీరూనాయక్ ఇంట్లో ఏసీబీ అధికారులు

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం రాములుతండాకు చెందిన కరీంనగర్‌లో వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఓ అధికారి ఇంట్లో శుక్రవారం ఏసీబీ అధికారుల దాడులు కలకలం రేపాయి. తండాకు చెందిన నూనావత్ వీరునాయక్ కరీంనగర్ వ్యవసాయశాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య రాధ ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు గూడూరు పోలీసు స్టేషన్‌కు చేరుకున్న ఏసీబీ అధికారులు ఇద్దరు కానిస్టేబుళ్లతో రాములుతండాకు చేరుకున్నారు. వీరూనాయక్ బంధువుల సాయంతో తాళం తీసి, ఇంట్లో అన్ని గదులను పరిశీలించి బీరువాను తెరిచి పలు పత్రాలను పరిశీలించారు. అనంతరం ఏసీబీ సీఐ శ్యాం సుందర్ మాట్లాడుతూ.. వీరూనాయక్ ఆదాయానికి మించిన ఆస్తులు కల్గి ఉన్నారనే ఫిర్యాదుతో సోదాలు చేపట్టామని తెలిపారు. గతంలో జనగామ, వరంగల్‌లో అగ్రికల్చర్ డీఏగా పనిచేసిన కాలంలో లంచాలు తీసుకున్న ఫిర్యాదు కూడా ఉందని, దీంతో ఆయనకు సంబంధించి తొర్రూరు, గూడూరు మండలం రాములుతండా, హనుమకొండ న్యూశాయంపేటలోని ఇళ్లలో ఏకకాలంలో సోదాలు జరిగినట్లు చెప్పారు. రాములుతండాలోని ఇంట్లో ఎలాంటి ఆధారాలు లభించలేదని వెల్లడించారు. ఏసీబీ సిబ్బంది ప్రవీణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

న్యూశాయంపేటలో..

వరంగల్ క్రైం: హనుమకొండ న్యూశాయంపేటలోని వీరూనాయక్ ఇంటిపై అవినీతి నిరోధక శాఖ అధికారులు (ఏసీబీ) శుక్రవారం ఉదయం దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలపై వీరూనాయక్ ఇంట్లో అధికారులు సోదాలు నిర్వహించినట్లు వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ దాడుల్లో మూడు ఇళ్లు, ఐదు ఇళ్ల స్థలాల పేపర్లు, వ్యవసాయ భూముల పట్టాదారు పాస్ పుస్తకాలు, కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీరూనాయక్ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు మండలాల్లో వ్యవసాయాధికారిగా పనిచేశారు.

రామచంద్రు తండాలో..

పెద్దవంగర: మండలంలోని రామచంద్రు తండాలోని వీరూనాయక్ మామ ఇంట్లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. వీరునాయక్ భార్య రాధ తల్లిదండ్రులైన జాటోతు ధూమా చోక్లీ స్వగ్రామం మండలంలోని రామచంద్రు తండాలో దాడులు చేపట్టగా.. ఎలాంటి పత్రాలు లభించకపోవడంతో వెనుదిరిగారు.

వారం రోజుల్లో చర్యలు తీసుకుంటాం

- పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై నివేదిక అందజేత
- ఘటనపై విద్యార్థి నాయకులకు సారీ చెప్పిన కేటీఆర్
- విచారణ కమిటీ వేయిస్తాం
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్


మంత్రి కేటీఆర్‌ను కలిసిన కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారంపై వారంరోజుల్లో చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి కేటీఆర్ కేయూ విద్యార్థి జాక్ నాయకులకు హామీ ఇచ్చారు. శుక్రవారం హనుమకొండ జిల్లాకేంద్రానికి వచ్చిన కేటీఆర్‌ను మడికొండలోని ఐటీపార్కు వద్ద కేయూ విద్యార్థి నాయకులు కలిసి కేయూలో పీహెచ్‌డీ రెండో కేటగిరి అడ్మిషన్లు, తదితర అంశాలపై మంత్రి కేటీర్‌కు విన్నవించారు. కొన్నిపేజీల రిపోర్టును అందజేశారు. కేయూలో గతనెల 5న పీహెచ్‌డీ అడ్మిషన్లపై ఆందోళన సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసుల చేతిలో గాయపడిన విద్యార్థులను కేటీఆర్ పరామర్శించారు. గాయపడిన విద్యార్థి నాయకులతో మాట్లాడుతూ.. మీపై జరిగిన సంఘటనకు ప్రభుత్వం, పార్టీ, తాను వ్యక్తిగతంగాను సారీ చెబుతున్నాని అన్నారు. గాయపడిన విద్యార్థినాయకులకు హైదరాబాద్‌లో మెరుగైన వైద్యం అందజేస్తామని తెలిపారు. విద్యార్థులపై పెట్టిన కేసులను కూడా ఎత్తివేయిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు విద్యార్థి నాయకులు తెలిపారు. అలాగే పీహెచ్‌డీ అవకతవకలకు సంబంధించిన ఆరోపణలపై విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రితో విచారణ కమిటీ నియమిస్తామని కేటీఆర్ వెల్లడించినట్లు పేర్కొన్నారు. విద్యార్థి నాయకులు మంత్రి కేటీఆర్‌ను కలిసేలా వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ అవకాశం కల్పించారు. కేటీఆర్‌ను కలిసినవారిలో జాక్ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి, నాయకులు మాచర్ల రాంబాబు, ఆరెగంటి నాగరాజు, అంకెల్ల శంకర్, ఎండీ పాషా, కేతపాక ప్రసాద్, మేడ రంజిత్, గుగులోతు రాజునాయక్ తదితరులు ఉన్నారు. కేటీఆర్‌తో జాక్ నేతలు మాట్లాడుతున్నప్పుడు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, పోలీస్ కమిషనర్ రంగనాథ్ ఉన్నారు. కాగా శుక్రవారం 31వ రోజుకూడా కేయూలో విద్యార్థి జేఏసీ దీక్ష కొనసాగింది.

7కేజీల ఎండు గంజాయి స్వాధీనం

- ఇద్దరు విక్రయదారుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కరుణాకర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కరుణాకర్

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎండు గంజాయిని విక్రయించేందుకు తీసుకొస్తున్న ఇద్దరిని పట్టుకొని వారి నుంచి 7.44 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ పుల్లా కరుణాకర్ వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీలో గంజాయిని విక్రయించేందుకు తీసుకొస్తున్నట్లు భూపాలపల్లి పోలీసులకు సమాచారం అందడంతో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, సంధ్యారాణిలు జయశంకర్ పార్కు, కేటీకే 5వ గని మూలమలుపు వద్ద వేర్వురుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ప్రాంతాల్లో ఇద్దరు పట్టుపడినట్లు తెలిపారు. పట్టణంలోని సుభాష్‌కాలనీకి చెందిన తోట పవన్ వద్ద అదే కాలనీకి చెందిన కంది సాయిచరణ్ 4.875 కేజీలు, భాస్కర్‌గడ్డకు చెందిన మందల కళ్యాణ్‌కుమార్ 2.565 కేజీల గంజాయిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. సాయిచరణ్, కళ్యాణ్‌కుమార్‌లు విక్రయించేందుకు తీసుకెళ్తూ పట్టుబడినట్లు తెలిపారు. గంజాయి విలువ రూ.1.86లక్షలు ఉంటుందన్నారు. తోట పవన్ పరారీలో ఉన్నాడని.. దొరికితే మరింత సమాచారం వస్తుందని తెలిపారు. ఎక్కడి నుంచి గంజాయి రవాణా అవుతుందని కోణంలో ఆరా తీస్తున్నట్లు చెప్పారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారమిస్తే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో భూపాలపల్లి డీఎస్పీ రాములు, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, సంధ్యరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

కాటారం: గంజాయి సేవించడంతోపాటు విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కొత్తపల్లికి చెందిన సెగ్గెం వంశీ, పెద్ది నిఖిల్‌రాజు స్నేహితులు. నిఖిల్‌రాజు ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంటి వద్ద ఖాళీగా ఉంటూ గంజాయికి అలవాటు పడ్డాడు. ఇదే క్రమంలో తన స్నేహితుడైన వంశీకి గంజాయి విక్రయిస్తుండగా సమాచారం మేరకు ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిఖిల్‌రాజు, వంశీ నుంచి 180 గ్రాముల గంజాయి, రెండు ముబైల్‌ఫోన్లు స్వాధీనపర్చుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫుడ్ పాయిజన్.. 8మంది విద్యార్థినులకు అస్వస్థత

- ఫుడ్ పాయిజన్ కాలేదంటున్న ప్రిన్సిపాల్


ములుగులో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండల కేంద్రంలోని మైనార్టీ మహిళ రెసిడెన్షియల్ కళాశాలలో మధ్యాహ్న భోజనం వికటించి (ఫుడ్ పాయిజన్) 8మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కళాశాలలో 106 మంది విద్యార్థినులు ఉండగా శుక్రవారం 95మంది హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత సానా, తైసీన్, హర్షిత, సానియా, ప్రణతి, సానియామీర్జా, ఆస్మా, సామ్యూ అనే విద్యార్థినులు కడుపు నొప్పితో బాధపడ్డారు. ప్రిన్సిపాల్ వందన వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి విద్యార్థినులను ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించారు. 8మందిలో ఐదుగురికి చికిత్స అందించిన అనంతరం డిశ్చార్జ్ చేశారు. మిగిలిన ముగ్గురు ములుగు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. కాగా వెంకటాపురం ఎస్సై తాజుద్దీన్ ఆదేశాల మేరకు ఏఎస్సై కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు మైనార్టీ హాస్టల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు.

ఈ విషయమై మైనార్టీ హాస్టల్ ప్రిన్సిపాల్ వందనను వివరణ కోరగా.. ఐదుగురు విద్యార్థినులు వైరల్ ఫీవర్‌తో, ముగ్గురు కడుపునొప్పితో బాధపడుతుండగా ములుగు ఆస్పత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించి తిరిగి హాస్టల్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఫుడ్ పాయిజన్ అయిందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ప్రిన్సిపాల్ చెప్పడం గమనార్హం.

ఎలక్ట్రికల్ షాపులో చోరీ


దొంగతనం జరిగిన ఎలక్ట్రికల్ షాపు


షాపులో పరిశీలిస్తున్న క్లూస్ టీం

- రూ.2.30లక్షలు చోరీచేసిన దొంగలు

వర్ధన్నపేట: వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద పాత బస్టాండ్‌లో ఉన్న మజీషా ఎలక్ట్రికల్ షాపులో గురువారం రాత్రి దొంగలు చోరీ చేసినట్లు వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన రాజ్‌పురోహిత్ జగ్‌మోహన్ వర్ధన్నపేట పాత బస్టాండ వద్ద మజీషా ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి 10.30 సమయంలో షాపు మూసివేసి ఇంటికి వెళ్లి పడుకున్నారు. జగ్‌మోహన్ తల్లి కేన్సర్ చికిత్స నిమిత్తం చిట్టీ ఎత్తుకున్న రూ.2.30లక్షలు షాపులో పెట్టి తాళం వేశాడు. శుక్రవారం ఉదయం 7.20 గంటల సమయంలో షాపు తెరిచి చూడగా.. వెనకవైపు ఉన్న తలుపులను పగులగొట్టి తెరిచినట్లు గుర్తించాడు. గుర్తు తెలియని వ్యక్తులు షాపులోని సీసీ కెమెరాల బాక్స్‌ను, డ్రాను పగులగొట్టి రూ.2.30లక్షలు దొంగిలించినట్లు గుర్తించారు. దీంతో క్లూస్ టీం షాపు వద్ద పరిశీలించింది. అక్కడ లభించిన ఆధారాలను సేకరించింది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

విభజన హామీలను నెరవేర్చాలి

హనుమకొండ: రాష్ట్ర విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాష్ట్ర పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద శుక్రవారం చేపట్టిన విభజన మహాదీక్షకు కేటీఆర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన కాజీ పేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ వంటి ప్రధాన హామీలను కేంద్రం నెరవేర్చలేదని పేర్కొన్నారు. తెలంగాణకు సెంట్రల్ మైనింగ్ యూనివర్సిటీ, నూతన రైల్వే మార్గాలు, నీటిపారుదల ప్రాజెక్టులు, సమ్మక్క–సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పించాలని, హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దీక్షలో విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ లోక్‌నాయక్, నాయకులు దేవోజీ నాయక్, భూక్యా హుస్సేన్, బానోతు సునీల్, రవీందర్, వెంకన్న, వెంకట్, భాస్కర్, సుధీర్, సురేష్, రవినాయక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ప్రభాకర్ రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యూనియన్ నాయకులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరష్కరించాలని భారతీయ మజ్దూర్ సంఘం అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రవీందర్, ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో జెన్‌కో, ట్రాన్స్ కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దేవులపల్లి ప్రభాకర్ రావును యూనియన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన యూనియన్ రాష్ట్ర కమిటీని బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రామిరెడ్డి.. ట్రాన్స్‌కో సీఎండీకి పరిచయం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్లు ఆర్.రమణ రెడ్డి, తక్కలపల్లి చందర్ రావు, ఉపాధ్యక్షులు పిన్నపురెడ్డి వేమనరెడ్డి, కె.శ్రీనివాస్, అడిషనల్ సెక్రటరీ ఏ.శంకర్, ముష్కు వేణు, వేణుమాధవ రెడ్డి, సురేష్, ఎ.రమేష్ కుమార్, టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ కడెం మహేష్, కె.సతీష్ బాబు, శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రిగా రావాలంటే.. మీరు గెలిపించాలి

- చాంబర్ కార్యాలయంలో మంత్రి కేటీఆర్


చాంబర్ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

కాశిబుగ్గ: నేను మంత్రిగా మళ్లీ రావాలంటే మీరు రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం మంత్రి కేటీఆర్ ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో సంక్షేమ సభ అనంతరం నేరుగా బస్టాండ్ సమీపంలోని వరంగల్ చాంబర్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర ఏండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. 2014కు ముందు తర్వాత తెలంగాణలో వచ్చిన మార్పులను గమనించాలని తెలిపారు. మా పాలన బాగుంటేనే ఓటు వేయండని అన్నారు. పొరపాట్లు ఉంటే మన్నించి రాబోయే ఎన్నికల్లో తమ్ముడు నరేందర్‌ను గెలిపించాలని కేటీఆర్ కోరారు. అనంతరం కేటీఆర్‌ను చాంబర్ ప్రతినిధులు సన్మానించారు. కేటీఆర్ వెంట మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, సీపీ రంగనాథ్, చాంబర్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ ఉన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండంలోని గిద్దెముత్తారానికి చెందిన కౌలు రైతు వేముల రాజేశం(48) పురుగుల మందుతాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశం మూడు ఎకరాల భూమి కౌలు తీసుకుని పత్తి, తన తండ్రికి చెందిన ఎకరం భూమిలో మిర్చి సాగు చేస్తున్నాడు. కాగా ఇటీవల భారీ వర్షాలతో పంటలు దెబ్బతినడంతోపాటు అప్పులు కావడంతో మనస్థాపం చెందాడు. దీంతో చేను వద్దనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో తరలించే క్రమంలో మృతి చెందాడు. కాగా, రాజేశానికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

నెల్లికుదురు: మానుకోట జిల్లా నెల్లికుదురు మండలంలోని దుర్గాభవాణి తండా శివారు భగ్న తండాకు చెందిన రైతు శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. భగ్న తండాకు చెందిన భూక్యా శంకర్ (36) మిరప పంట సాగు చేసి అప్పుపాలయ్యాడు. దీనికితోడు కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన శంకర్ శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగగా.. చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. శంకర్ తండ్రి మంగ్యా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

జ్వరంతో వ్యక్తి..

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి చెందిన మజిగాని లక్ష్మయ్య (55)(లచ్చం) జ్వరంతో శుక్రవారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న లక్ష్మయ్యకు స్థానికంగా వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.


రోడ్డు ప్రమాదంలో యువకుడు..


వెంకటేశ్(ఫైల్)

గూడూరు: మానుకోట జిల్లా గూడూరు మండలంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం రాత్రి ఓ యువకుడు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన పస్తం కనకయ్య, లాలమ్మ రెండో కుమారుడు వెంకటేష్(18) తన ద్విచక్ర వాహనంపై గూడూరుకు వస్తున్నాడు. ఆ సమయంలో మానుకోట వైపు జాతీయ రహదారిపై తహసీల్దార్ కార్యాలయం దాటిన తర్వాత పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో మానుకోట వైపుగా వచ్చిన టా టా ఏసీ ఆటో కొద్దిదూరంలో ఆగింది. అది గమనించని వెంకటేశ్ టాటా ఏసీ ఆ టోను ఢీకొన్నాడు. టాటాఏసీ వాహనంలో వెనకాల కూర్చున్న బొంత ఐలమ్మను ఢీకొనడంతో ఆమె చేయి విరిగి కిందపడిపోయింది. అదే సమయంలో బైక్‌పై నుంచి కింద పడిన వెంకటేష్ ప్రధాన రహదారికి మరో పక్కన పడడంతో ఆ వైపుగా వ చ్చిన కారు అతని మీదుగా వెళ్లింది. దీంతో వెంకటేష్ రెండు కాళ్లు విరిగిపోగా, తల కు తీవ్రగాయమైంది. గమనించిన పోలీసులు వెంకటేష్‌ను నర్సంపేట ఆస్పత్రికి.. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందు తూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చేయి విరిగిన ఐలమ్మకు గూ డూరు సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మహిళా ప్రొఫెసర్లపై వివక్ష

- అకుట్ జనరల్ సెక్రటరీ ఇస్తారి



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని అధ్యాపకులపై వివక్ష, వ్యక్తిగత కక్షలకు పాల్పడుతున్న వీసీ, రిజిస్ట్రార్‌లు తమ వైఖరి మార్చుకోవాలని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మామిడాల ఇస్తారి అన్నారు. ఈమేరకు శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్ రావును కలిసి అధ్యాపకుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ.. యూనివర్సిటీలో చట్టబద్ధంగా రావాల్సిన హెడ్, చైర్మన్ బోర్డు ఆఫ్ స్టడీస్, డీన్లు, ప్రిన్సిపాల్ పదవులు సీనియారిటీ ప్రకారం కాకుండా వీసీ, రిజిస్ట్రార్ తమ ఇష్టానుసారంగా నియమిస్తూ పలువురు అధ్యాపకులను అవమానపరుస్తున్నారని పేర్కొన్నారు. వీసీ, రిజిస్ట్రార్ వ్యక్తిగత కక్షలకు పాల్పడుతూ అధ్యాపకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాటనీ విభాగంలో ఉన్న రెగ్యులర్ అధ్యాపకురాలిని విభాగ అధిపతిగా నియమించకపోవడంతో సదరు అధ్యాపకురాలు హైకోర్టుకు వెళ్లాల్సి వచ్చిందని, యూనివర్సిటీ సమస్యలను కోర్టులో తేల్చుకొనే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని అన్నారు. సోషియాలజీ విభాగం అధిపతిగా, చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్‌గా ఎక్కువకాలం ఇద్దరు ఆచార్యులనే కొనసాగిస్తూ పదవీ కాలం పూర్తయినా కూడా మరొక ప్రొఫెసర్‌కు హెడ్ లేదా బీఓఎస్. చైర్మన్ ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. భౌతిక శాస్త్ర విభాగంలో మే నెలలో మరొక అధ్యాపకురాలికి రావాల్సిన హెడ్ షిప్‌ను ఇప్పటివరకు ఇవ్వకపోవడం నిర్లక్ష్యానికి, కక్షపూరిత వైఖరికి నిదర్శనమని అన్నారు. గణిత విభాగంలో ఆ విభాగ అధిపతి పదవీ సెప్టెంబర్‌లో పూర్తి అయినప్పటికీ ఇప్పటికీ రొటేషన్ పద్ధతిలో మరొక అధ్యాపకుడికి హెడ్ షిప్ ఇవ్వకపోవడానికి కారణాలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్మసీలో డీన్ ఆచార్య నర్సింహారెడ్డి పదవీకాలం ముగిసి ఆరు నెలలు గడిచినా.. ఇప్పటి వరకు తర్వాతి సీనియర్ అయిన ప్రొఫెసర్ గాదె సమ్మయ్యను డీన్‌గా నియమించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తాజాగా తెలుగు విభాగంలోని మహిళా అధ్యాపకురాలిని బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా నియమించాల్సి ఉండగా.. ఓ కాంట్రాక్టు లెక్చరర్‌ను నియమించి రెగ్యులర్ మహిళా అధ్యాపకురాలిపై వివక్ష చూపిన అధికారుల వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆ విభాగంలో పనిచేస్తున్న మహిళా అధ్యాపకురాలిని సంప్రదించకుండానే చైర్మన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ పదవి ఇవ్వడానికి ఎందుకు నిరాకరించారని ప్రశ్నించారు.